# కాంగ్రెస్‌కు ఓటేసి తప్పుచేసినం

మొదటిపేజీ తరువాయి...

ఇలాంటి పరిస్థితి చవి చూడలేదని, కాంగ్రెస్ పార్టీని గెలిపించి తప్పుచేశామని రైతన్నలు తీవ్రంగా మండిపడుతున్నారు. ఎన్నికలకు ముందు వ్యవసాయానికి ఏడు గంటల కరంట్ ఇస్తామని చెప్పారని, ఆ తర్వాత దానిని ఐదు గంటలకు కుదించారని, ఇప్పుడు అది కూడా రాకపోవడంతో కళ్ల ఎదుటే పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన చెందారు. అసమర్థ కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టి తప్పు చేశామని పశ్చాత్తాపం చెందుతున్నారు.

**కారు చీకట్లలో కర్ణాటక**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో తీవ్ర విద్యుత్తు సరఫరా సమస్య తలెత్తడంతో ఒక్క వ్యవసాయానికే కాకుండా గృహాలకు కాంగ్రెస్ సర్కారు కరెంట్ కోతలు తీవ్రతరం చేసింది. పట్టణ ప్రాంతాలకు అరకొర విద్యుత్తును సరఫరా చేస్తూ, గ్రామీణ ప్రాంతాలకు రాత్రి, పగలు అనే తేడా లేకుండా విద్యుత్తు కోతలు విధిస్తున్నారు. రోజుకు ఐదారు గంటలకు మించి విద్యుత్తు సరఫరా కావడం లేదు. కాంగ్రెస్ పాలనలో తమ బతుకులు అంధకారమయ్యాయని కన్నడ రైతులు మండిపడుతున్నారు. విద్యుత్తు కోతలు, లో వోల్టేజీ కారణంగా పైర్లు ఎండిపోయాయని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రోడ్డెక్కారు. సబ్‌స్టేషన్ల ఎదుట, అధికార పార్టీ ఎమ్మెల్యేల ఇండ్ల ముందు అన్నదాతల ధర్నాలతో కర్ణాటక రగిలిపోతున్నది. మెట్టపంటలు ఎండిపోతే వర్షాభావ పరిస్థితుల వల్ల అనుకోవచ్చు.. కానీ ప్రాజెక్టుల కింద అదే పరిస్థితి.. గొట్టపు బావుల కింద అదే దుస్థితి. ఎక్కడ చూసినా నోటికాడికి వచ్చిన లక్షలాది ఎకరాల్లో జొన్న, సజ్జ పంటలు, నీళ్లులేక పాలుతాగే దశలో ఉన్న వరిచేలు బీడుబారిపోతున్నాయి. ప్రభుత్వ అసమర్థత, రైతన్నల నిస్సహాయత వెరిసి కర్ణాటకలో ఎవరిని కదిలిస్తే కంట కన్నీరే కనిపిస్తున్నది. కాంగ్రెస్ సర్కారును గెలిపించి కష్టాలు కొనితెచ్చుకొన్నామని కన్నడ ప్రజలు తలపట్టుకొంటున్నారు.

### ఒక్కసారి కాంగ్రెస్ పాలన చూద్దామనుకోవడం తప్పయిపోయింది

'జేడీఎస్ పాలన చూశాం.. బీజేపీ పాలన చూశాం.. ఒక్కసారి కాంగ్రెస్ పాలన చూద్దాం అనుకొని ఆ పార్టీని గెలిపించి తప్పు చేశాం' అని సిందనూర్ తాలుకా సోమాలపల్లి గ్రామ అధ్యక్షుడు (సర్పంచ్) నామాల నాగేశ్వర్‌రావు ఆవేదన వ్యక్తం చేశాడు. సిందనూర్ తాలుకా కన్నారి గ్రామ శివారులో సాగుచేసిన తన జొన్న పంట కరెంట్ లేక.. నీళ్లు అందక పూర్తిగా ఎండిపోయిందని వాపోయాడు. తమ గ్రామంలోనే వేలాది ఎకరాల్లో జొన్న పంట, వరి చేన్లు ఎండిపోయాయని తెలిపాడు. తుంగభద్ర ఎడమ కాలువకు నీరు వదిలితే పంట కాపాడుకునే వారమని, ప్రాజెక్టులో నీరు లేకపోతే ఎక్కడి నుంచి వదులుతామని ప్రభుత్వం వాదిస్తున్నదని మండిపడ్డాడు. నీరు వదలకపోయినా కాలువల ద్వారా నింపుకొన్న బావులు, కుంటల నుంచి నీరు పారించుకోవడానికైనా విద్యుత్తు సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదని ఆగ్రహం వ్యక్తంచేశాడు. పేదలకు ఉచిత విద్యుత్తు ఇవ్వడం వల్ల వ్యవసాయానికి ఏడు గంటల విద్యుత్ ఇవ్వలేకపోతున్నామని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు కుంటిసాకులు చెప్తున్నారని మండిపడ్డాడు.

### ఎండిన పంటను కాలబెట్టుకోవాల్సిన పరిస్థితి

తాను, కుటుంబ సభ్యులందరం కలిపి ఈ ఏడాది మొత్తం 40 ఎకరాల్లో జొన్న పంట సాగు చేశామని, ఎకరానికి రూ. 30 వేల చొప్పున రూ.12 లక్షల పెట్టుబడి పెడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేయడంతో నిలువునా మునిగామని బుదనాల క్యాంప్‌నకు చెందిన రైతు గారపాటి వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశాడు. పెట్టుబడి కోసం బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చామని, బంగారు కుదవ పెట్టామని, ఇప్పుడు ఆ బాకీలు తీర్చడం మాట అటుంచి ఎండిన జొన్న చేను తగలబెట్టాలన్నా మరింత ఖర్చు అవుతుందని వాపోయాడు. కనీసం ఈ ఒక్క పంటను కాపాడేందుకు తుంగభద్ర ప్రాజెక్టు నుంచి నీళ్లు వదలాలని స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇంటి ముందు ధర్నా చేసినా ఎలాంటి హామీ లభించలేదని మండిపడ్డాడు. అసలు రైతులను ఆదుకోవాలన్న ఆలోచన కానీ, పంటలను కాపాడాలన్న తపన కానీ ఈ కాంగ్రెస్ సర్కారుకు లేదని తేలిపోయిందని అన్నాడు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పడం మినహా రైతన్న ఏమి చేయగలడని నిస్సహాయత వ్యక్తంచేశాడు.

**రైతులను ఆదుకోవడంలో తెలంగాణ సీఎం కేసీఆర్ నంబర్ వన్**

రైతులను ఆదుకోవడంలో, వ్యవసాయానికి తోడ్పాటు అందించడంలో తెలంగాణ సీఎం కేసీఆర్ దేశంలోనే నంబర్ వన్ అని నామాల నాగేశ్వర్‌రావు ప్రశంసించాడు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు అందిస్తున్నారని, రైతు బంధు ఇస్తున్నారని, రైతు బీమా అమలు చేస్తున్నారని, వీటితోపాటు తెలంగాణలో పేదలకూ సంక్షేమ పథకాలు అందుతుండటం గొప్ప విషయమని అన్నాడు. పక్కనే ఉన్న తెలంగాణలో రైతు సంక్షేమం సాధ్యమైనప్పుడు.. ఇక్కడ కర్ణాటకలో ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించాడు. తమది తెలంగాణ కంటే పెద్ద రాష్ట్రం అయినా సంక్షేమంలో వెనుకే ఉన్నామని ఆవేదన వ్యక్తంచేశాడు.

### ఇక్కడే చేతులెత్తేశారు.. తెలంగాణలో ఏం చేస్తారు?

ఎప్పటిలాగా పంటలు వేసుకుంటే, ఈ సారి విద్యుత్తు సమస్య వల్ల నిండా మునిగే పరిస్థితి వచ్చిందని బుదనాల క్యాంప్‌నకు చెందిన యువ రైతు బురిగిపల్లి నరేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. వ్యవసాయానికి విద్యుత్తు సరఫరా విషయంలో కర్ణాటక కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమయ్యిందని మండిపడ్డాడు. రాష్ట్రంలో విద్యుత్తు ఉత్పాదన సమస్య ఉంటే బయటి రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసి అయినా పంటలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని నిలదీశాడు. పొరుగున ఉన్న తెలంగాణలో అన్నదాతకు ఎలాంటి సమస్య లేదని, మరి ఇక్కడ అలా ఎందుకు చేయలేకపోతున్నారని ప్రశ్నించాడు. తెలంగాణలో ఓవైపు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ కూడా వ్యవసాయానికి సరిపడా కరెంట్, రైతులకు పెట్టుబడి సాయం అందిస్తుండగా.. ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు చేతకావడం లేదని నిలదీశాడు. ఇక్కడే చేతులెత్తేసిన కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణలో ఏం చేస్తుందని అన్నాడు.

## షకీల్‌ను గెలిపిస్తామని గిరిజనుల ప్రమాణం

నవీపేట, అక్టోబర్ 29 : బీఆర్ఎస్‌కే ఓటు వేస్తామంటూ నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం దర్యాపూర్ తండా గిరిజనులు ఆదివారం ప్రమాణం చేశారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు మద్దతు పలుకుతూ వచ్చే ఎన్నికల్లో బోధన్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్‌కే ఓటు వేస్తామని ముక్తకంఠంతో నినదించారు. ఆదివారం దర్యాపూర్ తండాకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీ నర్సింగ్‌రావు, నాయకుడు తెడ్డు పోశెట్టి, ఎంపీటీసీ డాంగే సతీష్ ప్రచారానికి వెళ్లగా వీరంతా బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించారు.

- **కేసీఆర్‌కు యూపీ సెటిలర్స్ మద్దతు**

సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో స్థిరపడిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన 200 సెటిలర్స్ కుటుంబాల వారు ఎన్నికల్లో కేసీఆర్‌కు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ ప్రతిని ఆదివారం గజ్వేల్‌లో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి అందజేశారు. బీఆర్ఎస్‌లో చేరారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పరిధిలోని చిరు వ్యాపారులు కూడా కేసీఆర్‌కు మద్దతు ప్రకటించారు. – గజ్వేల్

# స్వరాష్ట్రంలోనే మున్నూరుకాపులకు గౌరవం

- సముచితంగా గౌరవించిన బీఆర్ఎస్ సర్కారు
- మున్నురుకాపు కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తా
- కాంగ్రెస్, బీజేపోళ్లకు ఓటు వేస్తే తెలంగాణ గుడ్డి దీపం
- మెదక్‌లో మున్నూరుకాపు కృతజ్ఞత సభలో మంత్రి గంగుల

మెదక్‌లో నిర్వహించిన మున్నూరుకాపు కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న మంత్రి గంగుల

మెదక్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఏర్పాటైన తర్వాత బీఆర్ఎస్ పాలనలో మున్నూరుకాపులకు తగిన గుర్తింపు, సముచిత స్థానం దక్కిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం మెదక్ పట్టణంలోని వేంకటేశ్వర ఫంక్షన్‌హాల్‌లో మున్నూరుకాపు కృతజ్ఞత సభకు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి మంత్రి గంగుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ..తెలంగాణలో మున్నూరుకాపులను రాజకీయంగా గుర్తించి, ఆదరించింది సీఎం కేసీఆరేనని కొనియాడారు. సమైక్య రాష్ట్రంలో మున్నూరు కాపులను ఏ పార్టీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లోని కోకాపేట నడిబొడ్డున ఐదు ఎకరాల భూమిని మున్నూరు కాపులకు ఇచ్చారని, ఇప్పుడు దాని విలువ రూ.500 కోట్లు ఉంటుందని తెలిపారు.

**మొదటి మేయర్ మున్నూరుకాపే..**

తెలంగాణ వచ్చాక హైదరాబాద్ మొదటి మేయర్ మున్నూరు కాపు ముద్దుబిడ్డ బొంతు రామ్మోహన్‌ను నియమించగా, రెండోసారి మున్నురుకాపు బిడ్డకే ఇచ్చిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. ఆర్టీసీ చైర్మన్ పదవిని సత్యనారాయణకు ఇచ్చారని, మంత్రి పదవులను జోగు రామన్నతోపాటు తనకు ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే తెలంగాణ అంధకారం అవుతుందని హెచ్చరించారు.

కోకాపేటలో శారదాపీఠం నిర్మించనున్న రాజశ్యామలాదేవి ఆలయ ఆవరణలో జమ్మిమొక్కను నాటుతున్న ఎంపీ సంతోష్‌కుమార్. చిత్రంలో శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి

# కోకాపేటలో రాజశ్యామలాదేవి ఆలయం

- నిర్మాణం చేపట్టనున్న శారదాపీఠం
- ఆలయ ఆవరణలో జమ్మిమొక్కను నాటిన ఎంపీ సంతోష్‌కుమార్

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : దశ మహా విద్యా స్వరూపాలలో ఒకటైన అత్యంత పవిత్రమైన రాజశ్యామలాదేవి ఆలయాన్ని హైదరాబాద్ కోకాపేటలో నిర్మించనున్నారు. శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకమైన ఈ ఆలయాన్ని శారదాపీఠం వారు నిర్మిస్తారు. వైజాగ్ తర్వాత తెలంగాణలో నిర్మించడం ఇదే తొలిసారి. ఈ ఆలయ ఆవరణలో ఆదివారం గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు, ఎంపీ సంతోష్‌కుమార్ జమ్మిమొక్కను నాటారు. పవిత్రమైన ప్రదేశంలో జమ్మి మొక్కను నాటే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానని ఈ సందర్భంగా ఎంపీ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర బీఆర్ఎస్ ఇన్‌చార్జి కే వంశీధర్‌రావు, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 5 గంటల కరంటిచ్చే కాంగ్రెస్ వద్దు

- 24 గంటల బీఆర్ఎస్ సర్కారే ముద్దు
- బీఆర్ఎస్ అభ్యర్థితో రైతు గంగయ్య ముచ్చట

ఆదిలాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): 'నాకు ఊళ్లో ఆరెకరాల పొలం ఉంది. తెలంగాణ రాకమునుపు కరంటుతో మస్తు గోస పడ్డం. 3 గంటలే కరంటు ఇచ్చేటోళ్లు. పొలానికి నీళ్లు పెట్టనికి రాత్రి, పగలు తేడా లేకుండా బావుల కాడ కాపలా కాసేటోళ్లం. పాములు, తేళ్లు కుడుతాయేమోనని భయపడేటోళ్లం. తెలంగాణ అచ్చినంక కరంటు గోస తీరింది. సీఎం కేసీఆర్ సార్ 24 గంటలు ఫ్రీగా కరంటు ఇస్తున్నడు. కర్ణాటకలో 5 గంటల కరెంటు ఇస్తున్నామని ఆ రాష్ట్ర కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ చెప్తున్నాడు. వాళ్లు ఇచ్చే కరంటు ఒళ్లకు కావాలె? రైతులను కష్టాల పాల్జేసే కాంగ్రెస్‌కు ఓటెయ్యం. 24 గంటల ఫ్రీ కరంటు ఇచ్చే బీఆర్ఎస్‌కే ఓటేస్తాం'.. అని బోథ్ నియోజకవర్గం జాతర్ల గ్రామానికి చెందిన రైతు గంగయ్య తేల్చి చెప్పాడు. ఆదివారం గ్రామంలో ప్రచారం చేసేందుకు వచ్చిన బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్‌తో కొద్దిసేపు ముచ్చటించాడు.